# పగటి తారలు

"ఏమే బూసీ అన్నమైందా?" తలుపులు, కిటికీలు లేని కొట్టం ముందరున్న రాతి పైన కూర్చుంటూ అడిగాడు ఆరేళ్ళ మునస్వామి

"ఆ.... అయిందయ్యా, పీళ్ళింకారాలేదే" అంది రాళ్ళ పొయ్యి మీదున్న అన్నం గంజి వార్చుతూ బూసెమ్మ. అరవై గ్రీష్మాలు నిండిన బూసెమ్మ మనిషి సన్నగా యెండిన అముదం చెట్టులా కనిపిస్తోంది. ముగ్గు బుట్టలాంటి అమె తలవెంట్రుకల మధ్య అక్కడక్కడా వో నల్ల వెంట్రుక యెబ్బెట్టుగా తొంగిచూస్తోంది.

"ఈ వేళకు రావాల్సింది. యింకారాలే." తన ఆరేళ్ళ కుడి చేతిని కళ్ళ మీదుంచుకుని పీలేరు రోడ్డు వైపు చూస్తూ గొణిగాడతను.

కడుపు నిండా జంతువుల్ని మింగి మత్తుగా నిద్రపోతున్న కొండ చిలువలా వుంది రోడ్డు అది సాయంత్రపు టెండనే మలామా చేసుకున్నట్టు మిలమిలా మెరిసి పోతూ కనిపిస్తూంది. కనుచూపు మేర ఎక్కడా ఏ వాహనమూ రావడం లేదు.

రాళ్ళ పొయ్యిలో మండుతున్న కట్టెల మంటల్ని ఆర్పి, వేడి తగ్గించి వచ్చి అతని పక్కనే మరో రాతి మీద కూర్చుంది బూసెమ్మ. వార్చిన గంజి కాలువ గట్టి కొంత దూరం సాగి ఆగిపోయింది. గంజి వాసన కమ్మగా ముక్కులకు సోకుతోంది.

పొద్దుని తమ రెక్కలకు తగిలించుకుని ఎగురుతూన్నట్లు రెండు కాకులు ఆకాశంలో పడమటి కొండల వైపు ఎగురుతున్నాయి. రోడ్డు పక్కనున్న పసుపు రంగు బోర్డుపైన పీలేరు మూడు కిలోమీటర్లు, చిత్తూరు అరవై కిలోమీటర్లు అన్న అక్షరాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. భూకంపం ధాటికి ముందు భాగమంతా శిధిలమై పోయినట్టున్న గుడిసె శకలం ఒకటి ఆ రోడ్డుపక్కన ఏ ఆదరవు లేని అనాథ పిల్లలా కనిసిస్తోంది. మిగిలిన గుడిసెలోపలి వరకూ వ్యాపించిన రోడ్డు అక్కడ ఆ మధ్య సంభవించిన భూకంపమేమిటో చెప్పకనే చెబుతోంది. కూలిపోవడానికి సిద్ధంగా వున్నట్టున్న ఆ మూరెడు కప్పు కింద రెండు పాత ట్రంకు పెట్టెలూ, నాలుగైదు మసిబారిన పాత్రలు కనిపిస్తున్నాయి. కప్పు వాసాల నుంచీ రెండు మూడు చింపిరి గుడ్డలు వేలాడుతున్నాయి.

చుట్టూ ఒక్కసారి కలయచూసి బూసెమ్మ ఒక పెద్ద నిట్టూర్పు విడిచింది. "బంగారట్లా సుట్టిళ్ళు.. కొట్టం.. పెరట్లో చింతచెట్టు, అన్నీ వదులుకోని రోడ్డుపైన సంసారం పెట్టిస్తివిగదా" అంటూ ఆమె స్వగతంగా అనుకుంది.

"ఈ మాత్రం నీడ దొరికినందుకు సంతోషించు. వొగప్పుడు, యిదొక పెద్ద హోటలుగా వుండేదంట, పొయ్యే లారీలు, వచ్చే లారీలు ఇక్కడ నిలస్తావున్నాయంట. రోడ్డు వెడల్పు చేసేటప్పుడు దీన్ని కొట్టిపారేసినారంట. చూడబోతే మన లాంటోళ్ళకు నీడ చూపిద్దామనే దీన్నిట్టా మిగిల్చినట్టుండాది గవురుమెంటు. ఈ మాత్రం నీడ దొరికే దానికి ఇంతకు ముందు యిక్కడ చేరికోనుండే బిచ్చగాళ్ళతో యిద్దంచేసినంత పనయింది", విసుకున్నాడు మునస్వామి.

"ఆ మాత్రానికే మొనగోడు మాదిరి మాటాడతాండావే" బూసెమ్మ ముఖం చిట్లించుకుంది.

"అది కాదే. కంగుంది గ్రామంలో వుండే మన కొత్తిండ్ల నిండా వీధి నాటకాలేడే వాళ్ళే గదా వుండారు. ఊళ్లోమెల్లాడు గట్టిన పతిమొగోడూ నాటకాల్లోయేసికాలేసేవోడే. భారత నాటకాల్లోగానీ, రామాయణ నాటకాల్లోగానీ అన్ని యేసికాలూ యేసే సామర్తెంవుండేవోళ్ళే గదా. చాలా మందికి సొంత పేర్లేవుండవు. వున్నా ఆ పేర్లతో ఎవురూపిలవరు. వాళ్ళు మామూలుగా యేసే యేసికం పేరుతోనే గదా వాళ్ళను పిలస్తావుంటారు. వోళ్ళనట్లా తయారు చేసిన గురువును నేనే గదా మరి".

"గొప్పేగానీలే. కాదన్లే.. అదిసరే. ఊర్లో అందరూ కాసింతమడిచెక్కో, చేసు గుడ్డమో వున్నోళ్ళే. ఏం లాభం. పంటలు పండి ఎన్నో యేండ్లయిపాయ. మన నాటకాలే అంత కూడు బెడతావుండే, వాటికీ ఆదరణ లేకుండా అయిపాయ." బూసెమ్మ యాష్ట పోయింది.

"మనూరి నాటకాలకు ఎంత ఘనచరిత్ర వుండాది. సొతంత్రం రాక ముందు కాంగ్రెస్ తరపున మన నాటకాల ద్వారా దేశభక్తిని ప్రబోధించినాము. బెంగుళూరుకి గాంధీ వచ్చినప్పుడు ఆయన ముందర బొబ్బిలియుద్ధం నాటకమాడితమి. అది జూసిన గాంధీ మన నాటకాలను ఎంతగానో మెచ్చుకున్నాడు. అప్పట్నుంచీ మనవాళ్ళకు కొత్త బలం వచ్చింది. అప్పటికి నాది శ్యానా న్యాతవయస్సు. యెసుగాయిని. ఇక అప్పటినించీ ఇప్పటి వరకూ నాటకాలేస్తానే వుండాము. వాటితోనే కదా సంసారాలు నెట్టకొస్తావుండాము." గతాన్ని తవ్వుకోసాగాడు మునస్వామి.

"అఁ. పేరుగొప్పా. ఊరుదిబ్బ అని ఏం లాభం. ఇప్పుడు జరుగుబాటు కావద్దా. ఎకరాలకెకరాల భూములు బీళ్ళుబడి పోతావుండాయి. జనాలు ఏ సమచ్చరానికా సమచ్చరం అప్పులు చేసి బతికే స్తితిదాపరించ. బావుల్లో నీటి చుక్క కండ్ల జూసి ఎన్నేండ్లయిపాయ? దినదినానికీ కరువు పెరిగి పోతావుండాది. గొడ్లను మేపుకోలేక కసాయోళ్ళకు అమ్మేసికుండ్రి. శ్యానా మంది బ్యాంకుల్లోలోన్లు తీసుకున్నారు. మూడు నెలలకొకతూరి కంతు. అదికూడా కట్టే పరిస్థితి లేదు. ఎట్లోవొగట్ల బతకాల గదా. కూలీనాలీ చేసి ఈ సమచ్చరం నెట్టకొచ్చిరి. ఈ సారీ వానబడలే. కుంటల్లో బావుల్లో జల్లేళ్ళు మెలిచి పోయి, అవి గూడా ఎండిపోబట్టె. చెరువులు నెర్రెలు బారిపాయ. కరువుదెబ్బకు పెద్ద పెద్ద టెంకాయ చెట్లు, చింతచెట్లు గూడా ఎండిపోతాండాయి. జనాలకు తిండ్లికేకాదు తాగేనీళ్ళకూ కరువొచ్చేసిండాది. చేసే దానికా పనుల్లేవు. పల్లెల్లో చూసేదానికైనా వొగ పాలగొడ్డు లేదు. కలికానికైనా పాలు దొరకడం కష్టమై పాయ. భూమి పుత్రావున్నోళ్ళ సంగతే ఇట్లా వుంటే ఇంక నాటకాలాడి బతికే కుటుంబాల గురించి సెప్పేదేముండాది? పదినెలలు మోసి కనీ పెంచిన బిడ్డల్ని వంటిగా వదిలేసొస్తిమి?" ఆమె గొంతు జీరబోయింది.

"అసలు ఈ కాలంలో నాటకాలు చూసే వాళ్ళెవరు? యేపించే వాళ్ళెవరు? ఆటోళ్ళ సంసారాలు పస్తులతో పడుకుంటావుండాయి. ఆ బ్రహ్మయ్యన్నా ఒక నాటకం యేపిస్తే బాగుండు" అన్నాడు మునస్వామి.

"చుట్టుపక్కల పల్లెలవాళ్ళు మూటాముల్లె సర్దుకొని బిచ్చమెత్తుకోబట్రి. మూలిగే నక్కపైన తాటికాయ బడినట్లు కరెంటు చార్జీలు కట్టలేదని కరెంటోళ్ళు వైర్లు కత్తిరించేసి మీటర్లు, మోటార్లు లాక్కపోయినారు." అంది బూసెమ్మ.

"పల్లెల్లో లైటు మలిగి ఎన్ని దినాలైపాయ? అందురూ చీకట్ని మోసుకోని తీరగతావుండారు". చెప్పాడు మునస్వామి.

"ఊల్లో చాలా మందకి నూనె దీపాలు వెలిగించుకునే పరిస్థితి గూడా లేకపాయ, బతుకే దుర్భరంగా మారిపాయ. జనాలు బ్యాంకీలో లోన్ల సంగతే మరిచిపోయిరి. కంతులు కట్టి రెండేండ్లయిపాయ. బ్యాంకీ వాళ్ళు నోటీసుల మీద నోటీసులిచ్చిరి. ఇంక కట్టకపోతే మీ యిండ్లు జప్తు చేస్తామని చెప్పి యెళ్ళిపాయ ఫీల్డాఫీసరు. జప్తు చేసే దానికి మనిండ్లల్లో ఏముండాయనీ..." అంది బూసెమ్మ.

"ఇంట్లో బిడ్డెల్ని పస్తులు బెట్టలేక, ఆ బ్యాంకీ వాళ్ళలోన్లు తీర్చలేకనే గదా ఇట్ల 'పలస్తరం' వచ్చేసినాము. ఈడ ఈపన్లో జేరినాము."

"ఇదయిపోతే యింకొగటెతుక్కోవాల. లేకుంటే కడుపాత్రం తీరుతుందా" బూసెమ్మ గొంతులో యింకా జీరతొంగి చూస్తూనే వుంది.

"కడుపు చేత్తో బట్టుకోని ఊర్లు తిరిగే వాళ్ళకు ఏవూరైతే ఏమిలే.. యాడబతుకు తెరువుంటే ఆడికి పోవాల్సిందే. ఇక్కడికి పైగడ్డ దెగ్గిరే. ఆ బ్రహ్మయ్య అయినా కనిపిస్తే బతిమాలో బామాలో నాటకం యేపిచ్చుకోవచ్చు."

భర్త మాటలు చెవిన బడనట్టుగా బూసెమ్మ లేచి రాళ్ళ పొయ్యి దగ్గరికి కదిలింది. మూకటి పైకెత్తి అన్నం ఉమ్మటిల్లిందో లేదో ఒక్కసారి చూసింది. పక్కనున్న మసిగుడ్డ సాయంతో అన్నపు చట్టిని రెండు చేతుల్తో ఎత్తుకొని వెళ్ళి లోపల పెట్టింది.

"ఏమిరా బప్పను. మనపిలకాయలేమన్నా కనిపించిరా?" అన్న మునస్వామి మాటలు వినబడగానే ఆమె తలపైకెత్తి చూసింది.

సన్నగా, పొట్టిగా వున్న నడివయసు వ్యక్తి ఒకతను గుడిసె దగ్గరికి వస్తూ కనిపించాడు. చిరిగిన చొక్కా, నిక్కరు లోంచీ సన్నటి అతని శరీరం రక్తమాంసాలతో గాకుండా కర్రముక్కలతో చేసినట్టుగా కనిపిస్తోంది. అతని బట్టలపైనా శరీరంపైనా రంగురంగుల పెయింట్ మచ్చలుమచ్చలుగా అతుక్కుని వుంది.

"లేదయివోరా కనిపించలేదు. కానీ యింకొగాయన కనిపించినాడు." అన్నాడు బఫూన్.

"ఎవరు?" అడిగాడు మునస్వామి.

"నేను బజార్లో ఒగతావన సవకలమింద నిలబడి గోడకు పెయింటుకొడతావుంటి. అప్పుడు కనిపించె ఆనా కొడుకు."

బఫూన్ నవ్వుతున్నాడో లేదో గానీ అతడి పెదవులు మాత్రం చిత్రంగా వంకర్లు తిరుగుతున్నాయి.

"సాగదీసి సాగదీసి నవ్వించే దానికి ఇదేమీ నాటకం గాదు గానీ ప్రాణం తీయ్యొద్దు. యెవుడోచెప్పు." సీరియస్‌గా అన్నాడు మునస్వామి.

"మనూరి గ్రామీణ బ్యాంకు ఫీల్డాఫీసరు?" చెప్పాడు బఫూన్.

ఆ మాటవినగానే ఒక్కక్షణం మౌనంగా ఉండి తిరిగి "నిన్నుగానీ గుర్తుపట్నాడా?" అని అడిగాడు మునస్వామి.

"నేను ఆయన్ను జూస్తిగానీ, ఆయన నన్ను జూడలేదులే."

"బతికించినాడు. వాడు మనపోవుడీ తెలుసుకునే దానికే వచ్చింటాడు."

"ఉండచ్చు"

"ఏమిరా బప్పనుబాలయ్యా! గుడ్డలు దీసి బోరింగు కాడికి బొయ్యి నీళ్ళు బోసుకోనిరా. లేకుంటే నీకు రేత్తిరికి నిద్రకూడా రాదు. పో." లోపల్నుంచీ వస్తూ చెప్పింది బూసెమ్మ.

"అవును అయివోరమ్మా. బాగా సబ్బేసుకోని తోమితే గానీ ఈ రంగులు పోవు." అనుకుంటూ లోపలికి వెళ్ళి బట్టలు విప్పి మొలకు తుండు గుడ్డ చుట్టుకొని, ఎర్రసబ్బు చేతబట్టుకుని బోరింగు దగ్గరికి నడిచాడు బాలయ్య.

వాళ్ళక్కడికి వచ్చి ఇన్ని దినాలు చేసిన కూలీ డబ్బుల్నిచ్చి సహదేవున్ని శనివారమనంగా ఊరికి పంపారు. ఎవురిదుడ్లు వోళ్ళకిచ్చి ఆదివారం మసకలు పడే సరికి రావయ్యా అని జెప్పి పంపారు. అతనింకా రాలా.

కూరసరకులకని పీలేరుకు మరికొందరు పోయారు. వారూ రాలేదు. వారి కోసమే వాళ్ళు ఎదురు చూస్తున్నారు.

"వీళ్ళేమన్నా ఆ ఫీల్డాఫీసరు కండ్లల్లో బడిరేమొ?" గొణుక్కున్నాడు మునస్వామి.

ఆ మాట పూర్తయ్యీ కాకనే పీలేరు నించీ కల్లూరు వైపుకు వెళ్తూ అక్కడికి వచ్చి అగింది ఒక ట్రాక్టర్. దాని నిండా జనాలే వున్నారు. ఆ జనంలోనుంచీ కొందరు దిగారు. వాళ్ళు దిగిన మరుక్షణం దుమ్మురేపు కుంటూ వెళ్ళిపోయింది ట్రాక్టర్.

"ఏమిరా భీముడూ, ఇంతసేపూ.." దిగిన వాళ్ళను పలుకరించాడు మునస్వామి.

"కూరగాయలు దీసుకొని వస్తావుంటే ఎన్టీవోడి బొమ్మ కనిపించె గురువా. పాండవవనవాసం. మ్యాట్నీకి బోయింటిమి."

"సిల్మా బొమ్మ కనిపిస్తే చాలు. మీ ముగ్గురికీ వొళ్ళు తెలవదులే. ఒరే దుర్యోధనా. నువ్వయినా వాళ్ళిద్దరి చెవులు బట్టుకోని దూరంగా యీడ్సక రాగూడదా..?" ముసిముసిగా నవ్వుతూ అన్నాడు మునస్వామి.

రోడ్డుపైన ట్రాక్టర్ లేపిన దుమ్ములోనుంచీ అస్తమిస్తున్న సూర్యుడు కొండల వెనకకు జారిపోతూ కనిపిస్తున్నాడు. నలిగిన బట్టలు, అలసిన ముఖాలతో బక్కపలచటి మనుషుల గుంపొకటి పారలు, గునపాలు చేతబట్టుకొని రోడ్డుపైన నడిచిపోతున్న దృశ్యం కనిపిస్తోంది. ఆకాశంలో పక్షులు సైతం తమతమత గూళ్ళను వెతుక్కుంటున్నట్టుగా పయనిస్తున్నాయి.

బాలయ్య బోరింగు స్నానం పూర్తిచేసి పొడిబట్టలు కట్టుకొచ్చాడు. మరికొంత సేపటికి రేగిన దుమ్ముతో బాటూ వచ్చి అగింది ఒక బస్సు.

"మన సహదేవుడొచ్చినట్టుండాడురో." అన్నాడు గురువు.

అంత వరకూ మౌనంగా వున్న బూసెమ్మ ముఖం సంతోషంతో వెలిగిపోయింది. ఆమెనుంచీ ఆనందాన్ని అరువుపుచ్చుకుంటున్నట్టుగా ఆ సాయంత్రం ఆరు గంటలకే హెడ్‌లైట్స్ ముఖానికి తగిలించుకుని బస్సు వెళ్ళి పోయింది. మరి కొంతసేపటికి, ఆ గుడిసెకెదురుగా రోడ్డు కవతల కరెంటు స్తంభానికున్న లైటు వెలిగింది.

"ఏమిరా సక్కడూ. మా ఆడపిలకాయలెట్టుండారు? యిద్దర్నే వదిలేసి వస్తిమి యింట్లో" అతృతగా అడిగింది బూసెమ్మ.

"వాళ్ళకేం బాగానే వున్నార్లే." అన్నాడు చేతిలోని సంచీ లోపలపెడుతూ సహదేవుడు.

మరింతగా నలిగిపోయిన దుస్తుల్ని తొడుక్కుని వాటిని వీలయినంత కిందికి లాక్కుని సర్దుకుంటూ బఫూన్ బాలయ్య" మా ఆడోళ్ళు కనబడినారా? నేనిచ్చిన దుడ్డు వాళ్ళకిస్తివా లేదా? అంటూ హడావుడిగా ప్రశ్నించాడు.

"యిచ్చేసినాను లేరా బప్పనూ. అట్ల కొట్టేవాడి మాదిరిగా చూడొద్దులేరా కృష్ణా. మీ నాయనకు కూడా నువ్విచ్చిన రూకలిచ్చేసినాను. అదిసరే గానీ రెండు ముఖ్యమైన వార్తలు గూడా మోసకొచ్చినా, చెప్పమంటారా వద్దా." అంటూ రెట్టించాడు సహదేవుడు.

"ఏం వార్తలబ్బా." అన్నాడు కృష్ణుడు.

"బిరీనా చెప్పు సామి." తాళలేనట్టు అడిగాడు దుర్యోధనుడు.

"పై గడ్డన కరువు నాటకం వేయాలంట. ఆ నాటకమప్పుడే భారతం కూడా వప్పిస్తారంట. బ్రహ్మయ్య పంపించినాడంటా కార్యకర్త చంద్రయ్య వచ్చి 'చెంచికారం' యిచ్చిపోయినాడు".

సహదేవుడందించిన డబ్బు తీసుకొని లెక్క పెట్టుకుంటూ "పోనీలేబ్బా, బ్రహ్మయ్య మననెత్తిన పాలు బోసినాడు. ఇంతకూ నాటకమెప్పుడు? అడిగినాడు మునస్వామి."

"వచ్చే శుక్రారం."

"సరే రెండో వార్త ఏదో చెప్పు." అడిగినాడు దుర్యోధనుడు.

"బ్యాంకీ వాళ్ళు మళ్ళా ఊర్లోకొచ్చినారంట. మనపోవుడీ గురించి అడిగినారంట. ఫీల్డాఫీసర్లు మనల్ను తారాడతా ఈ పక్కకే వచ్చినారంట."

ఏదో రహస్యం చెబుతున్నట్లుగా స్వరం తగ్గించి చెప్పాడు సహదేవుడు.

"అవున్లే. బప్పన్ బాలయ్యకు టవున్లో వొగఫీల్డాఫీసరు కనిపించినాడంట." చెప్పాడు మునస్వామి.

"ఆం... వాన్ని చూసినాడంటనా?" ఆదుర్దా పడుతూ అడిగాడు సహదేవుడు.

"లేదులే" అన్నాడు గురువు.

"ఇట్టాంటి పరిస్థితిలో యేసికాల కోసం మనం ఉర్లోకి బోతే యెట్లా?" అన్నాడు దుర్యోధనుడి పక్కన నిలబడివున్న అర్జునుడు.

"దానికింకోపని చేద్దాం లేరా అర్జునా. ఈ తూరి బేస్తవారం నాడు ఎవుర్నోవొగర్ని ఊరికి పంపించి యేసికాలు సీను గుడ్డలు ఈడికి తెప్పించుకుందాం. ఈడినించీ పై గడ్డ దెగ్గిరేగదా. అందురూ కల్సుకోని శుక్రోరం నాటికి పై గడ్డకు పోదాం." అంటూ పైకి లేచాడు ఆరేళ్ళ మునస్వామి.

## 2

బస్సు లోపల క్రిక్కిరిసిన జనసమూహం మధ్యలోనుంచీ అతి కష్టం మీద దారిచేసుకుని కిందికి దిగాడు మునస్వామి. జనంతోపులకు తన శరీరంలోని భాగాలన్నీ సరిగా వున్నాయో లేవో సరిచూసుకోవడం కోసమన్నట్టుగా తనను తాను కాసేపు పరకాయించి చూసుకున్నాడు. జేబుల్ని తడుముకున్నాడు. చెదరిన జుట్టును చేత్తో సవరించుకుంటూ వెనుదిరిగి చూశాడు. బస్సు టాప్ పైన కూర్చున్న ప్రయాణీకుల్ని అదిలిస్తూ కట్టగా కట్టిన ఆయుధాల కట్టనూ, కిరీటాల మూటనూ కిందికి దింపుతున్నాడు సహదేవుడు. కిందినుంచీ ఆ మూటల్ని అందుకుంటున్న కృష్ణుడు "భద్రంరా! ఆ గద ఇరిగి పోయేను. విల్లంబులు రాలిపోయేను... ఆ కిరీలాట మూట భద్రంగా అందియ్యి" అంటూ హడావుడి పడిపోతున్నాడు. అతడి పక్కన నిల్చుని సహాయం చేస్తున్న దుర్యోధనుడు ఆయా మూటల్ని పదిలంగా అందుకుని రోడ్డు పక్కకు చేర్చుతున్నాడు.

రోడ్డుకి కొంత దూరంలో ఏవో కొన్ని చిన్న చిన్న పూరిండ్లు తప్ప ఎక్కువగా ఏవీ లేవు. ఆ యిండ్ల ముందునుంచీ వచ్చిన వంటి బిత్తల పిల్లలు కొందరు మూటల్లోంచీ తొంగి చూస్తున్న కాకి బంగారపు తొడుగుల ఆయుధాల్నీ కిరీటాల్నీ, వాటిపైన బడి చిత్రంగా పరివర్తనం చెందుతున్న సాయంకాలపు సూర్యకిరణాల్నీ విచిత్రంగా పరికిస్తున్నారు.

"ఏం గురువా? బాగుండావా?" అంటూ వాళ్ళను సమీపించాడో వ్యక్తి. మనిషి స్ఫురద్రూపి. తెల్లని పొడుగు చేతుల చొక్కా, గ్లాస్కో్ పంచె, కోరమీసం, అక్కడక్కడా నెరిసిన జుట్టు... బాగా నడి వయసులో వున్నాడతను.

"ఓ... చంద్రయ్యా, బాగుండాము గానీ.... ఏంది ఒంటిగా కనిపిస్తావుండావు? నువ్వా ఆ బ్రహ్మయ్యా కృష్ణార్జునులు మాదిరి ఎప్పుడూ జంటగా కనిపిస్తారు గదా!" అడిగినాడు మునస్వామి.

"చెర్లోవిరాటపర్వం హరికథ చెప్పించినాము గదా! పగటి కథ చెప్పిన హరికథ దాసుకి దుడ్డిచ్చి పంపించే దానికి పొయినాడు. మీరొస్తే నన్ను చూసుకోమని చెప్పినాడు" చెప్పాడు చంద్రయ్య.

"సరే. యింతకీ యాడబ్బా ఆటేసేదీ?"

"ఊరి ముందరుండ్లా, అదే పెద్దచెరువు. ఆ చెరువు కివతలుండ్లా మామిడి చెట్లు. ఆ చెట్లల్లో సలవ పందిళ్ళేయించినాము. హరికథ గూడా ఆడనే జరిగింది. ఆట గూడా ఆడనే"

"సరే. ఆడికే పోదామా," అడిగాడు సహదేవుడు.

"ఆడికి పొయ్యే ముందు! మా యింటికి పొయ్యి, ముగాలుకడుక్కోని అంత కాఫీ తాగేసి వద్దాం. భోజనాలు గూడా ఆడనేలే" అన్నాడు చంద్రయ్య.

"మా కొత్తిండ్లు నించీ కొందరి ఆటోళ్ళను నేరుగా ఈడికి రమ్మని చెప్పింపితిమి, వాళ్ళేమన్నా వచ్చినారా?" అడిగాడు మునస్వామి.

"హార్మోనియం బాలక్రిష్ణ, తబలిస్టు .సిద్దయ్య, ధర్మరాజు యింకా నాలుగైదు మంది వచ్చినారు. మా యింటికాడే వుండారు. మీరు రండి." అన్నాడు చంద్రయ్య.

"ఒరే భీమా, నకులా... అందరూ రండ్రా." అరిచాడు మునస్వామి. అర్జునుడూ, నకులుడూ, సహదేవుడూ, దుర్యోధనుడూ, భీముడూ, బఫూన్ బాలయ్యా తలా ఓ మూట నెత్తిన పెట్టుకొని

ముందుకొచ్చారు. బరువైన పాత గోనెసంచీ చేతిని లాగుతుంటే బూసెమ్మా ముందుకు కదిలింది. బాగా పాతబడి, వెలసి పోయివున్న మట్టి గోడల ఇండ్ల మధ్య, వీధిలో నడవసాగాడు చంద్రయ్యా. నాలుగైదు గుడిసెలు దాటిన తర్వాత ఓ కొట్టం ముందు ఆగాడతను. లోపలినుంచీ బయటకు తొంగి చూసిన స్త్రీ "వచ్చినారాండీ! మీ పెట్టెలు అన్నీ అడబెట్టి మొగాలు కడుక్కోనిరండీ" అంటూ అహ్వానించింది.

"నీ భార్యది పెద్దమొఱుసూ, పెద్ద చెయ్యీ చంద్రా! ఎప్పుడొచ్చినా నవ్వతానే పలకరిస్తుంది. అయమ్మ రుణం యెప్పుడు తురుతుందో." అనిమెచ్చు కుంటూ బాగుండారామ్మా? అంటు పలుకరించాడు మునస్వామి.

ఆటవాళ్లు పెట్టెలు, ఆయుధాల మూటను గోడవారగా వుంచి పెరట్లోకి వెళ్ళారు. వాళ్ళకు రెండుటవళ్ళు, వొగ సోపు అందించాడుచంద్రయ్య. ఒకొకరే సోపుతో ముఖాలు, కాళ్ళూ చేతులు కడుక్కొని, తువ్వాళ్ళతో తేమ తుడుచుకున్నారు. ఆ తర్వాత కొట్టంలో కొచ్చారు. నేల మీద పరచివున్న చాపలపైన ఒకరొకరే వచ్చి కూర్చున్నారు. అక్కడే ఒక మూలన చెక్క టేబుల్ మీద వున్న టీ.వి. ఆన్ చేశాడు చంద్రయ్యా.

"అయ్యయ్యో బ్రహ్మయ్యా.. అన్యాయం చేశావేమయ్యా.." అంటూ టీ.వి.లో పాట జోరుగా వినిపించింది.

"ఈ బ్రహ్మయ్యేమో యింకారాలా? ఎప్పుడొస్తాడో ఏమో?" అన్నాడు మునస్వామి.

"బ్రహ్మయ్యకు వొగపనయితే గదా. చిన్న చిన్న కాంట్రాక్టుపన్లు చేస్తాడు! ఊర్లో మద్దెస్తాలు చేస్తాడు. న్యాయాలు చేస్తాడు. ఇట్ల పండగలకు పబ్బాలకు, భారతాలకు చందాలు వసూలు చేయిస్తాడు. ఊరికి ప్రెసిడెంట్ గదా, మంచికయినా చెడ్డకయినా ఆయప్ప వుండాల్సిందే. లేకుంటే చీమ గూడ చిటుక్కుమనదు. చూసేదానికింత చిన్నదిగా వున్నా ఈ ఊరికి చుట్ట పక్కలుండే ఇరవైముప్పయి గ్రామాలంతా ఈ పంచాయితీలోనే వుండిపోయా. ఏదో పనిమీద బొయింటాడు. వచ్చేస్తాడులేగురువా. ముందు మీరు కొంచెం అలుపు తీర్చుకోండి. మళ్ళా ఎనిమిది కంతా ఆట ఆరంభించాల." తాను కూడా చాపపైన కూచుంటూ అన్నాడు చంద్రయ్య.

పొయ్యిగడ్డ ముందు కూర్చుని డేకిశాలో నీళ్ళు పోస్తున్న చంద్రయ్య భార్య "బ్రహ్మయ్యన్న మనిషయితే బయటూర్లో ఏమద్దిస్తంలోనో వుంటాడుగానీ, మనసంతా యిక్కడ్నే వుంటుందిలేన్నా. భారతాలూ, ఆటలూ అంటే ఆయప్పకు వొళ్ళే తెలియదు. ఆయననే మనిషేలేకపోతే ఈపక్క సమచ్చరమూ భారతాలు జరింపిచేటోళ్ళు ఎవురుండారు చెప్పు? నెల్లూరు కృష్ణదాసు చేత, ఉడాందాసు చేత ఎన్ని హరికధలు పెట్టించినాడు! మీ కంగుందోళ్ళ చేత ఎన్ని భారతాలాడిపించినాడు! ఎన్ని ఆటలు యేపించినాడు!" అంది.

"భారతమంటే ఏమి సన్నాబన్నా సమాచారమా? యాభైవేలకు పైగా సెలవవతావుండె, అందుకోసరం బ్రహ్మయ్యే మాపల్లెల్నించీ మెంబర్లను పిలిపించి కమిటీలు యేసి, యింటికి యింత అని పంపకం వసూలు చేయిస్తావుండె. ప్రతిసారీ నేను గూడా అయిన్నూట పదహార్లు చందాయిస్తావుంటి. కానీ మూడేండ్లుగా కరువొచ్చి, భారతం జరిపించే పరిస్థితి లేకుండ అయిపాయ.

ఈ మూడేండ్లు బ్రహ్మయ్య భారతం పేరును, ఆటోళ్ళనూ తలుచుకోని రోజు లేదనుకో. ఏం పనిమీద పోయినాడో గానీ యిప్పుడూ అక్కడ భారతం కోసరం చందాలు వసూలు చేసే పనిమీదే వుంటాడు. దుడ్డు వొదిగితే యెట్టయినా పజ్జెనిమిది దినాల భారతం వొప్పించాలంటా వుండాడు. అప్పటికి గానీ ఈ గడ్డన చినుకు రాలదని కరాకండిగా జెప్తావుండాడు...." చెప్పకుపోతున్నాడు చంద్రయ్య.

"యిన్ని దినాలుగా పీలేరు దగ్గర చేస్తావున్న పని నిన్నటితో అయిపాయ. రేపుట్నుంచీ యింకేడికన్నా పోవాల్సిందే అంతలోపల బ్రహ్మయ్య వస్తే బాగుండు. ఇంతకూ బ్రహ్మయ్య ఎప్పుడొస్తాడో." కాఫీతాగుతూనే మనసులోనే అనుకున్నాడు మునస్వామి.

"ఏం గురువా? అటేసే తావుకు పోదామా?" కాఫీ గ్లాసు కిందపెట్టి, పైకి లేస్తూ చంద్రయ్య అన్నాడు.

మునస్వామి మనసంతా బ్రహ్మయ్య మీదనే వుంది. పరధ్యానంగా తలవూపుతూ పైకి లేచి కొటం బయటి కొచ్చాడతను. మిగిలిన వాళ్ళు కొందరు తమ తమ సరంజామాతో సహా అతన్ననుసరిం చారు. చంద్రయ్య వెంట అందరూ ముందుకు కదిలారు.

"బ్రహయ్యొచ్చి భారతం వొప్పిస్తే కొన్ని దినలయినా ఊర్లో పిల్లా జల్లా అన్ని గంజి నీళ్ళు తాగతారు. కడుపాత్రం తీరుతుంది. బ్యాంకీ బాకీలు అంతో ఇంతో తీర్చచ్చు. లేక పోతే ఈ కూలి దుడ్డుతో బత్తెం కొననే సరిపోతా వుండాదే." అవిరామంగా ఆలోచించసాగాడు మునస్వామి. ఆలోచించే కొద్దీ కొలిమిలో కమ్మి మాదిరి అతని గుండె కాలిపోసాగింది.

"చందాల కోసరం పోయిన మనిషికి వొళ్ళు బాగలేకుండా అయిపాయనేమొ! జరగరాని అపితి యేదయినా జరిగిపాయనేమో! ఈ మనిషి జన్మకు నమ్మకం ఏముండాది? ఈ పొద్దున్నోడు రేపులే. రేపున్నోడు మరునాడులే.... యేందీ పూట ఇట్లా యోచిస్తావుండానే. బ్రహ్మయ్య కేమీ జరక్కొడదు. ఆయన చానామంచోడు. ఈ గడ్డన నలుగురికి ఆదరువుగా నిలబడి నోడు. ఆయప్ప బాగుంటేనే గదా అందురూ బాగుంటారు. అందురూ బాగుంటేనే గదా ఆటోళ్ళు బాగుంటారు. ఈ చెరువు తప్పిపోయే దానికి నాటకాల్లో మాదిరి అంటే సరిపోయ. అ మంగళం ప్రతిహతమగుగాక...."

మునస్వామి ఆలోచనలు పూర్తి కాక మునుపే ఊరి ముందరున్న ఎండిపోయిన చెరువులోకి చేరుకున్నారు అందరూ.

చెరువు సందడిగా ఉంది. కొందరు జనం వస్తున్నారు. మరి కొందరు పోతున్నారు. కట్టమీద జనం, కట్ట కిందా జనమే. ఎవరో వాతలు పెట్టినట్లు చెరువునిండా నెర్రెలు. ఆ నెర్రెల్లో తొండాకులు, పాములు పెట్టుకున్న గుడ్లు కనిపిస్తున్నాయి. అక్కడక్కడా ఎండిపోయి కనిపిస్తున్న ముండ్ల చెట్లు, గబ్బు చెట్లు.... ఆ చెరువుకు మొగదల మిట్టపైన ఎత్తుగా పెరిగి వున్నాయి మామిడి చెట్లు. వాటి మధ్యలో రంగురంగుల షామియానా పందిళ్ళు... జనం బారులు బారులుగా వెళ్తున్నారు. పందిళ్ళ కవతలున్న రెండు చలివేంద్రాల దగ్గరా జనం నీళ్ళు తాగుతూ గుంపుగా చేరివున్నారు. చెట్లకు తూర్పుగా పైగడ్డ ఇండ్లు కనిపిస్తున్నాయి. అయిండ్ల మధ్యనున్న బస్టాండు నుంచీ కూడా జనం గుంపులు కట్టుకొని వస్తున్నారు. యెండిన చెట్ల లాగే జీవశక్తి వుడిగి పోయిన బక్క శరీరాల మనుషులు.... అన్ని రకాల వయస్సుల్లోనూ రకరకాల వ్యక్తులు. యిద్దరిద్దరుగా, గుంపులు గుంపులుగా అనేక రకాల సమూహాలు...

అందరి ముఖాల్లోను ఏవో నీడలు తారట్లాడుతున్నాయి. వర్షాలు రాక అప్పులు పాలయిన అభాగ్యులు, పెండిండ్లు కాని పిల్లలు, పనీపాటాలేని నిరుద్యోగులు.... ఒకేరకం బతుకులు. బతికీ బతకని బతుకుల చిత్రాలు.... ఆ చిత్రాల మధ్య నలిగి, కరిగి, ఆవిరై పోతున్న మనుషుల నీడలు.... అందరూ నడుస్తున్న మోళ్ళల్లా కనిపిస్తున్నారు. మరబొమ్మల్లా కదలాడుతున్నారు. కానీ వాళ్ళల్లో మాత్రం యింకా కాస్తా వెలుతురు.... దేని కోసమో దేవులాడుకుంటున్నట్లుగా వాళ్లందరూ వస్తూనేవున్నారు... పందిరి చుట్టూ సందడిగా వుంది.

షామియానాకు పడమటి వైపున ఒక చిన్న స్టేజీ. దానికి వెనక టార్పాల్‌తో కట్టిన ఒక చిన్న అర. షామియానాలో అక్కడక్కడా వెలగని సీరియల్ బల్బులు వెలవెల బోతున్నాయి. చంద్రయ్యా మునస్వామి స్టేజీ మీదకొచ్చారు.

"ఇదే గురువా స్టేజీ. మీరు ఈ అరలో యేసికాలు యేసుకోవాల." అరలోకి తొంగి చూస్తూ అన్నాడు చంద్రయ్య.

అప్పుడే రికార్డు సెట్టువాడు టేపురికార్డరు సిద్ధం చేసుకుంటున్నాడు. "సీను గుడ్డలు కట్టండ్రా" అంటూ తన వెంటవచ్చిన వారిని పురమాయించాడు మునస్వామి.

"మీ సామాన్లన్నీ మీరే భద్రంగా పెట్టుకోండి గురువా! ఈడ కొందరు దొంగనాయాండ్లుంటారు. యామారినారంటే మీ యేసికాలు గూడ జవురుకోని పోతారు. ఈ కరువు దినాల్లో కొనే వాళ్ళుండాలే గాని, దేన్నయినా అమ్మేసుకొని అన్ని తిండి గింజలొచ్చినాయి గదా అనుకుంటారు. ముందే చేప్తావుండా. ఆపైన నన్ను నిష్టూరం చేసి లాభం లే." అంటూ హెచ్చరిస్తూనే వాళ్ళకు సహాయం చేయడం మొదలెట్టాడు చంద్రయ్య.

దుర్యోధనుడు, కృష్ణుడూ సీను గడ్డల మూట విప్పి, స్టేజిపైన అంతఃపురం తెరను వీలయినంతగా లాగి కట్టసాగారు. నకుల సహదేవులు స్తంభాల గుడ్డల్ని స్టేజీకిరువైపులా నిలువుగా కట్టసాగారు.

అది పూర్తయిన తర్వాత "జనాలు అప్పుడే వస్తావుండారు. పొద్దు గూడా పోతావుండాది. ఇంక ఆలస్యం చేసేదానికిలే. పోదామా." అన్నాడు మునసామి.

"పొద్దుకల్లానే భోంచేసి వచ్చేద్దాం" అన్నాడు చంద్రయ్య.

"మాకంగుందోళ్ళు ఆటేసే రోజు చానా నిష్టగా వుంటారు. చారు, మజ్జిగన్నం తప్పా ఏమీతిన... ఆ సంగతి తెలుసుగదా" అన్నాడు మునస్వామి.

"ఆ సంగతి నాకూ తెలుసులే అయ్యవారా!" అని "ఎవుడ్రా ఆడ" అంటూ కేకేశాడు చంద్రయ్య.

ఆ మాటవిని " ఏం సినాయనా" అంటు పరిగెత్తుకొచ్చాడు మరో కార్యకర్త సుబ్బరాజు.

"ఆటోళ్ళకు మాయింట్లో అన్నాలు ఏర్పాటు చేసినాం. నువు పదా. మేమొచ్చే లోపల అక్కడ ఏర్పాట్లు చూడు" చెప్పాడు చంద్రయ్య.

అదే సుగ్రీవాజ్ఞగా భావించిన సుబ్బరాజు గబ గబ అక్కడి నుంచీ వెళ్ళి పోయాడు.

మునస్వామీ, చంద్రయ్యా ఆ మాటా, ఈ మాటా మాటాడుకుంటూ యింటి వైపుకు బయలు దేరారు. అప్పటికే అక్కడున్న ఆటోళ్ళు టీ.వి. చూస్తూ అన్నాలు తింటున్నారు. సుబ్బరాజు అన్నం

వడ్డిస్తుంటే, చంద్రయ్య భార్య చారు పోస్తోంది. బూసెమ్మ కూడా వడ్డించడంలో ఆమెకు సాయం చేస్తోంది.

"ఏం గురువా? మనం యేస్తావుండేది విరాటపర్వమే గదా. నిష్టగా యేస్తే వానొస్తాదిగదా. మన నాటకం బిందయి పోతే యెట్టా?" అనుమానం వెళ్ళ గక్కాడు హార్మోనిస్టు బాలకృష్ణ.

"సదుం దెగ్గిర, సీతమ్మ చెర్లో వొగతూరి కరువు నాటకం ఆడినాము. విరాట పర్వంలో ఉత్తర గోగ్రహణం కత జరగతావుండాది. అంతే వచ్చేశ వాన. దెబ్బటం వాన. తెల్లారే గుందికి చెరువులు నిండిపాయ. కుండల్తో కుమ్మరించినట్టే బడింది అనుకో" గొప్పగా చెప్పాడు భీముడు.

"అదెప్పటి మాట. పదేండ్ల ముందు మాట." అన్నాడు మునస్వామి తాను కూడా విస్తరిముందు కూచుంటూ.

"ఆమాట కొస్తే.... వొగబ్బుడు చిన్నగొట్టిగల్లు చెరువులో ఉడాందాసు హరికథ చెప్పె. మనోళ్ళు యిరాటపర్వం ఆడిరి. కోడికూసే జాముకంతా చెరువులు మొరవలెత్తుకుండె." అన్నాడు ధర్మరాజు.

"ఆ కాలం సత్తెకాలం, విరాటపర్వం ఆడినా వాన జరోమని కురస్తావుండె" కొటం వెలుపలికి వచ్చి, ఆకాశంలోకి చూస్తు అన్నాడు కృష్ణుడు.

ఆకాశంలో అతని కంటికి అక్కడక్కడా ఎవరో గొబ్బెమ్మల్ని బెట్టినట్టుగా నల్లనల్లంగా మేఘాలు కనిపించాయి.

"అయితే, ఈ మద్దెన యెన్ని భారతాలు జరిపించినా వానలు బడడం లేదే" అన్నాడు చంద్రయ్య.

"పాపం పెరిగిపోయిండ్లా లోకంలో... హరికధలకు, బుర్రకధలకు వానలు బడే కాలం ఎప్పుడో పోయిండాది. అంతా మన భ్రమ గానీ మంత్రాలకు చింతకాయలు రాల్తాయా యాడన్నా! యేదో ఊరికే ఉండలేక జేస్తావుండాము. వొగచిన్న ఆశ అంతే." సాగదీస్తూ చెప్పాడు సుబ్బరాజు.

"అట్లని మన ప్రయత్నమూ మానలేము గదా," అన్నాడు చంద్రయ్య.

"ఇది ముందే తొలేటి వానలు బడే కాలం. దేముడు కండ్లు తెరవాల్నే గానీ, యెంతసేపు? గడియలో వానలు కురిసి వంకలు దొర్లవా" మళ్ళీ సాగదీస్తూ అన్నాడు సుబ్బరాజు.

" ఆటజరిగేటప్పుడు వొగేళ వాన పడితే యెట్టా?" ప్రశ్నించాడు బాలకృష్ణ.

"పడితే అప్పుడు చూసుకుందాం లే." అన్నాడు అంత వరకూ మౌనంగా వింటున్న సిద్దప్ప.

ఆటేసే స్థలం నుంచీ మైక్ సెట్టోళ్ళు రికార్డు లేసినట్టున్నారు. "నమో వెంకటేశా నమొ నమో తిరుమలేశా." లవుడు స్పీకర్లో పాట వినిపించిసాగింది.

"అబ్బా. ఏమి సవుండురా సామీ. చెవులు పగిలిపోతా వుండాయి. ఈ లవుడు స్పీకరు వల్ల టీవీలో పాటగూడ వినిసించలా." అంటూ చంద్రయ్య వెళ్ళి టీవీ ఆఫ్ చేసి వచ్చాడు.

"ఈ లవుడుస్పీకర్లు ముందున్నాయా? కరెంటొచ్చినాంకనే గదా యివి వచ్చింది." యెవరో అంటున్నారు.

"మేమైతే చిన్నప్పుడు దివిటీలు పెట్టుకోని గొంతు పగిలి పోయేట్లుగా రేత్తిరంతా అర్సిసస్తా వుంటిమి. ఈ మద్దెనే గదా పల్లెలకు కరెంటొచ్చి లవుడు స్పీకర్లు, మైకులు వచ్చింది." అన్నాడు మునస్వామి.

'ముందు... పెండ్లిండ్లకు దేవర్లకు పలకలు మేళాలు వాయిస్తావుండ్రి. బ్యాండు మేళాలు, నవరంగ్ సెట్లు వచ్చింతర్వాత అవి సావులకు సంవత్సరాలకు మాత్రమే పరిమితమై పాయ "

"ఇప్పుడు లవుడు స్పీకర్లు మాత్రం ఎవురు పెట్టిస్తున్నార్లే! జాతర్లకు, ఉపన్యాసాలకు పెట్టిస్తావుండారంతే."

ఇప్పుడు టీవీ ఛానళ్ళొచ్చి రేడియోలు, టేపురికార్డులు మూలబడిపోలే"

" ఇవన్నీ వున్నోళ్ళకుపయోగపడతా వుండాయి గానీ లేనోళ్ళకు నెత్తిబరువైపోతా వుండాయి."

"అవునబ్బా. సిలమాలొచ్చి నాటకాలు యేట్లో కలిసిపాయ. ఈ సిల్మాలు, సి.డీ.ల వల్లా రాబోయే కాలంలో నాటకాలు నామ రూపాలు లేకుండా అయిపోతాయి"

"ఇట్టాంటబ్బుడు మన ఆటోళ్ళు యెట్లబ్బా బతికేది!"

"ఆబ్రహ్మయ్య లాంటోడు మండలానికొకడున్నా మునలాంటోళ్ళ బతుకులు తెల్లంగా తెల్లారతాయి. లేకంటే చీకటే గదా! ఆ ముండా కొడుకు యింకారాలేదే. ఏమైనాడో" మనసులోనే అనుకున్నాడు మునస్వామి.

"అదిసరే. ఈ పొద్దు ద్రౌవది వేషం యెవురేస్తావుండారు గురువా?" అంటూ వాళ్ళ మాటల ధోరణిని మార్చే ప్రయత్నం చేశాడు చంద్రయ్య.

"గెల్లపల్లోళ్ళ వీరప్ప వచ్చిండాడు. ఆ పక్కనుండాడు చూడలేదా? చూసేదానికి బక్క పల్చగా కనిపిస్తా ఉండాడు గానీ, గొంతెత్తి నాడంటే యింకమైకుతో గూడ పనిలేదు. కంట్లమా? సుక్కలు రాలాల్సిందే. ఒకసారి వీరప్పచేత చుక్కులూరి రామనాటకంలో సీతయేసికం యేయించి నీకు చూపిద్దామని వుంది. వీరప్ప సీత యేసికం యేసి కంట్లంయిప్పినాడంటే ఆడోళ్ళు పైటలు తడిసి పోయేట్టుగా, మగోళ్ళు పైగుడ్డలు నాని పోయేట్లుగా యాడవాల్సిందే." అంటూ మునస్వామి వీరయ్య వైపు చూస్తూకళ్ళెగరేశాడు.

చంద్రయ్య కాస్సేపు మౌనంగా చెవులురిక్కించి జాగ్రత్తగా వింటూ "లౌడుస్పీకర్లో అనౌన్సుమెంట్లు మొదలయినట్టుండాయి. మీమీ వేషాల పెట్టెలూ, సామాన్లు తీసుకొని బయల్దేరండి. లేటయిపోతూవుంది." అంటూ హడావుడి పడ్డాడు.

## 3

స్టేజి మీదా, షామియానాలోను, చెట్లుల్లోను రంగురంగుల సీరియల్ లైట్లు ఒక్కసారిగా వెలిగాయి.

"అందరూ మేకప్పులు మొదలు బెట్టండ్రా! జనం వచ్చేస్తావుండారు. యింకాలస్సెం జేస్తే మనకు బరముండదు." అంటూ మునస్వామి గగ్గోలు పెట్టసాగాడు.

"నాటకమంటేసాలు ఈ గురువుకు. ధరణిమింద నిలబడడింక." అని విసుక్కుంటూ ధర్మరాజు తన వేషాల పెట్టెను తెరిచాడు.

చేతి అద్దాలు తీసుకొని ముఖాలు చూసుకుంటూ కొందరూ, అర్దాలం, రంగులు, విగ్గులు ముందర బెట్టుకొని మరికొందరు వేషాలు వేసుకోవడంలో మునిగిపోయారు.

స్టేజీ మీద ఒక పక్కన కుర్చీ వేసుకొని, లెగ్ హార్మోని ముందరుంచుకుని కూర్చున్నాడు హార్మోనిస్టు బాలకృష్ణుడు. అతనికెదురుగా మరొక పక్కన వేసివున్న బెంచీల మీద కూర్చొని తబలిస్టు సిద్దప్ప తబలాలు ముందర బెట్టుకున్నాడు. మునస్వామి అటాని పుస్తకం, తాళాలు, చేతబట్టుకుని వచ్చి సిద్దప్ప పక్కనే కూర్చున్నాడు. ప్రక్కన కూర్చున్న చంద్రయ్యను చూస్తూ "ఏమప్పా, బ్రహ్మయ్య ఇంకారాలేదే." అని అడిగాడు.

"ఆయనకు వొగపనా. ఆడయాడనో మద్దిస్తం చేస్తావున్నాడంట. యిరువర్గాలకు ఏదో బెడిసిందంటలే. యిప్పుడే వర్తమానం వచ్చింది. బ్రహ్మయ్య పాకాల పోలీసు స్టేషన్‌కు పోయినాడంట. ఇక్కడ నైట్ హాల్ట్ బస్సుందే పాకాల బస్సు, దానికొస్తాడులే గురువా! యింక మేళం కట్టండి." అన్నాడతను.

అరలోపల కొబ్బరికాయ పగిలింది. హారతి గంట వినిపించింది. కొంత సేపటికి వెలుగుతున్న హారతి పళ్ళెం హార్మోనియం ముందరికి, తబలాల ముందరికీ వచ్చింది. హారతిని అందరూ కళ్ళకద్దుకున్నారు. హారతిలోపలికికి వెళ్ళింది. మరుక్షణంలోనే బాలకృష్ణుడి వేళ్ళు హార్మోనియం మీద చెకచెకా కదిలాయి. సిద్దప్ప చేతుల్లో తబలాలు ఉరిమాయి.

"పరాబ్రహ్మ పరాబ్రహ్మ పరమేశ్వర సుప్రకాశా" గురువు ఒక నుడుగు పాడాడు. అరలో ఆటోళ్ళు అదేనుడుగు పాడుతూ తాళం వేస్తూ 'మేళం' కట్టారు. దాని తర్వాత " గజాననా ఓం గజవదనా" అంటూ ఆటతాళంలో వినాయకస్తుతి మొదలయింది.

"కైలాసవాసా గజాననా ఓం - పార్వతీ పుత్రా గజాననా ఓం

ఈశ్వర నందన గజాననా ఓం - విఘ్ననాయకా గజాననా ఓం"

ఆట తాళంలో ఆరంభమైన దరువును మునస్వామి అదికెక్కించాడు. స్టేజీ గుమ్మెత్తింది. తర్వాత సమాజం వాళ్ళంతా నాటక సమాజానికీ, విద్యనేర్పిన గురువుకీ జేజేలు కొట్టారు. అరలోపలనే ధర్మరాజు తన పాత్ర ప్రవేశాన్ని సూచించే సంధి పద్యం పాడాడు. తర్వాత "పాండావులిదుగో వచ్చిరీ... పంచ పాండావులిదుగో వచ్చిరి" అంటూ దరువు పాడుకుంటూ ధర్మరాజు రంగస్థలం పైకి ప్రవేశించాడు. అదే నుడుగును వెనక పాటగా పాడుకుంటూ మిగిలిన పాండవులు కూడా అతన్ననుసరించారు.

ఆట ఆరంభమై పోయింది. వెనక పాట పాడే వాళ్ళు పాడుతున్నారు. తాళాలు వేసే వాళ్ళు వేస్తున్నారు. గురువు కూడా తాళాలు వేస్తూనే అప్పుడప్పుడు అటాని ఎత్తిస్తున్నాడు.

నాటకంలో పాండవుల అజ్ఞాతవాసం ఆరంభమైంది.

ధర్మరాజు కంకుభట్టు పేరుతోనూ, భీముడు వలలుడుగా, అర్జునుడు బృహన్నలుగా, నకుల సహదేవులు తామ్రగంధి, తంత్రీపాలుడనే మారుపేర్లతోనూ మత్స్యవల్లభుని కొలువులో చేరిపోయే కతనడుస్తోంది. నుడుగులు పాడుతూనే మునస్వామి, చుట్టూ కలయ చూస్తున్నాడు. కాస్సేపటి తర్వాత నైట్‌హాల్ట్ బస్సు కూడా వచ్చి, రోడ్డు కవతల, చెట్టు కింద కునికి పాట్లు పడసాగింది. మునస్వామి మనసు మనసులో లేదు. యెంతకూ రాని బ్రహ్మయ్య చుట్టూ అతని మనసు గిరగిర లాడుతోంది. వెనకనుంచీ చంద్రయ్య మాటలు వినబడగానే తిరిగి చూశాడు. అతను సుబ్బరాజుతో మాట్లాడుతున్నాడు.

"ఏమయ్యా చంద్రా! బ్రహ్మయ్య వచ్చునా" తాళాలు వేయడం ఆపి మరీ అడిగాడు మునస్వామి.

"అదే మాట్లాడుకుంటున్నాం గురువా! తెల్లారేగుందికి వస్తాడులే" అన్నాడు చంద్రయ్య.

"పొకాల్లో పనైపోతానే వస్తాడు. ఎట్లయినా ఈ సారి భారతం యేపించాలని చాలా పట్టుదలగానే వుండాడులే." అందుకున్నాడు సుబ్బరాజు.

రోడ్డు మీద రాకపోకలు తగ్గినాయి. గంటకొక లారీనో, జీపో వెళుతోంది. స్టేజీ మీద 'సైరంధ్రి' "అంటరాకు ముట్టరాకురా కీచకా నేముట్టురాలనై వున్నానురా" అంటూ చేతి రుమాలును ముఖానికి వేసుకుని యేడుస్తూ దరువు పాడుతూ సింహబలుణ్ణి వేడుకుంటోంది. కీచకుడు ఆమె మాటల్ని లెక్క చేయడం లేదు. ఆమె వెంటబడ్డాడు. ఆమె సుదేష్ణాదేవిని వేడుకుంది. ఆమే ఏమీ చేయలేక పోయింది. అలాగే విరాటుని కొలువుకు వెళ్ళింది. ఆ రాజు గానీ, ఆ సభలోని వ్యక్తులు గానీ ఆమెను రక్షించలేక పోయారు. చివరకు నర్తనశాలకు భీముడు మారు వేషంలో వెళ్ళడం, కీచకుని చంపడం వరకూ కథ సజావుగా సాగిపోయింది. రంగస్థలం మీద పాత్రలు వరుసగా వస్తున్నాయి పోతున్నాయి. రాత్రి గబగబా గడిచిపోతోంది.

ఎంత ప్రయత్నించినా మునస్వామి మనసు సమాధానపడడంలేదు. నుడుగులు పాడుతున్నా అతని చూపులు మాత్రం బ్రహ్మయ్య కోసమే యెదురుచూస్తున్నాయి.

"ఏముమండా కొడుకో... యింకారాలా." మరోసారి అనుకున్నాడు మునస్వామి. విరాటపర్వం గడిచిపోతోంది. రంగస్థలం పైన ఉత్తర గోగ్రహణం ఆరంభమైంది. తూర్పున తెనె రేగింది. రోడ్డు మీద వాహనాల రాకపోకలు అప్పుడే ఆరంభమైనాయి. రాత్రంతా భారతం మిట్ట పక్కన రోడ్డులోనే విశ్రాంతి తీసుకుంటున్న నైట్‌హాల్ట్ బస్సు కాస్సేపు రణగొణ ధ్వనుల్ని ప్రసారం చేశాక, యిష్టం లేనట్టు బరువుగా ముందుకు సాగిపోయింది.

ఆట ముగించాల్సిన సమయం దగ్గర పడడంతో అర్జునుడు పద్యాలను దరువుల్ని వీలయినంత ముక్త సరిగా ముగించసాగాడు. విరాటుని కొలువు కూటం ఆరంభమైంది. విజయలక్ష్మిని వరించి ఉత్తరుడు విచ్చేస్తున్నాడన్న వార్త అందింది. పాచికలాడుతున్న విరాటుడికి కంకుభట్టుకు వాగ్వివాదం జరిగింది. ఈ విజయం బృహన్నలదంటున్నాడు కంకుభట్టు. కాదు ఉత్తరుడిదే అంటున్నాడు విరాటుడు. మాటా మాటా పెరిగింది. కోపం తెచ్చుకున్న విరాటుడు పాచికలతో "నపుంసకుని గెలుపు చెప్పి పొగడం జనునే" అని కంకుభట్టు ముఖంపైన కొట్టాడు... కంకుభట్టు ముఖం చిట్లి రక్తం కారుతోంది. .. అది గమనించిన సైరంధ్రి తన పైటతో ఆ రక్తాన్ని తుడుస్తోంది. విరాటుడు ఆతనికీ నీకు ఏమిటి సంబంధం అని అడుగుతున్నాడు. పాండవులు ఇంద్రప్రస్థంలో వున్నప్పుడు మేమిద్దరం వాళ్ళకు సేవ చేసేవాళ్ళమని చెబుతోంది సైరంధ్రి. 'మరి నీ పైటతో అతని రక్తాన్ని ఎందుకు తుడిచావు' అంటూ హుంకరిస్తున్నాడు విరటుడు.

"అయ్యా! ఈ కంకుభట్టు ధర్మస్వరూపుడు, అతను ఎక్కడుంటే అక్కడ నెలకు మూడు వానలు కురుస్తాయి. బంగారు పంటలు పండుతాయి. అతని నెత్తురు గనక నేలపై బడితే ఏడేడు పదునాల్గు తరాల వరకు ఆ దేశంలో కాటకం వస్తుంది, సిరిసంపదలు నశిస్తాయి. జనం తిండికి

కటకటలాడతారు. సకుసంపద నాశనమైపోతుంది. అరాచకం పెరిగిపోతుంది. ప్రజలు ఆదేశం వదలి వెళ్ళిపోతారు. ఆచేపష్ట. రాజుకు ప్రాణ సంకటం ఏర్పడుతుంది. అందువల్లా అలా చేశాను" ఒంటోంది ద్రౌపది."

కంకుభట్టు పాత్రధారి తొందరలో యెక్కువగా ఎర్రరంగు రాసుకున్నట్టున్నాడు. నేలపైన బద్ధ ఎర్రరంగు మెరుస్తోంది.

"రక్తం కింద పడనేపడింది. యింక కరువులు రాక తప్పవు" అంటూ మునస్వామి మనసుగించుకుంది. అంతలో "యిదంతా నాటకమే గదా! " అంటూ తననుతాను సముదాయించుకున్నాడు.

తెల్లవారి పోతోందన్న హడావుడిలో పాండవులు తమ అజ్ఞాతవాసాలను త్వరత్వరగా బట్టబయలు చేస్తున్నారు. ఉత్తరాభిమన్యుల వివాహం తూ తూ మంత్రంలా ముగిసింది.... ఎవరో తరుముతున్నట్లుగా ఆటగాళ్ళు మంగళమందుకున్నారు.

పొద్దు కరకరా మొలిచింది. అంత వరకూ నల్లగా కనిపించిన మబ్బులు పసిడిరంగును పరుచుకోసాగాయి.

"ఈ బ్రహ్మయ్య యింకెందుకొస్తాడు.! రేత్తిరంతా ఎదురు చూసీచూసీ కండ్లు కాయలైపోయ. ఆశబెట్టి ముంచేసినాడు." అంతవరకూ అణచిపెట్టుకన్న కోపం మునస్వామిలో చిందులు తొక్కసాగింది. " చాలు చాలు! ఇంక బిరీనా వేషాలిప్పుకోని పెట్టెల్లో పెట్టండి. మిగిలిన వన్నీ మూటలు గట్టండి. మళ్ళా మనం ఏ కూలి పనో ఎదుక్కోవాల!" అంటూ అందరిపైనా విరుచుకుపడ్డాడతను.

ఆటోళ్ళు కొబ్బరినూనెతో అర్దాలంతుడుచుకుని, ఎవరి వేషాలు వాళ్ళు తీసేసి, ఎవరి పెట్టెల్లో వాళ్ళు భద్రపరుచుకున్నారు. సిద్దప్ప తబలాలు సంచిలో వేసి మూటగట్టాడు. బాలకృష్ణుడు హార్మోనియం మడచి పెట్టెలో పెట్టేశాడు. రాత్రంతా రంగస్థలం మీద నటుల చేతుల్లో దగదగా మెరిసిపోయిన ఆయుధాలూ కిరీటాలూ మళ్ళీ మూటల రూపంలోకి చేరుకున్నాయి.

"ఈ సంవతసరానికింక అటేసే అవకాశం రాదేమో? బ్యాంకీలోన్లు తీరేదెట్లా? యిప్పటికే గ్రామంలో చానామంది అటోళ్ళు యేసికాలేసుకోని అడుక్కుంటా పల్లెలంటా పట్నాలంటా పోయినారు. ఈ బ్రహ్మయ్య రాకపోతే, భారతం వప్పించక పోతే మా పరిస్థితీ అంతే గదా. పగటేసికాలేసుకోని అడుక్కోవాల్సిందే. లేకుంటే బిడ్డా పాపల్తో కట్టగట్టుకోని సావాల్సిందే. ఈ అన్నేకారి బ్రహ్మయ్య వచ్చింటే బాగుండు. భారతం వప్పించింటే బాగుండు" మునస్వామి మనసులోనే మధనపడసాగాడు.

"చెంచికారంబోనూ మిగిలిన దుడ్డంతా యిదే గురువా? ఈ సారికి తీసుకో. వానలు బడి వంకలు దొర్లిపంటలు పండితే, వచ్చే పంవత్సరం పజ్జెనిమిది దినాలు గాదు ఇరవై యొక్క దినాల భారతం జరపతాం. అప్పుడు దీనికి పదింతల ఆదాయం వస్తుందిలే..." అంటూ డబ్బులు అందించాడు చంద్రయ్య.

"మీ బ్రహ్మయ్య రాకనే పాయ. కావాలని ముఖం చాటేసుకున్నాడులే. అయన... మాలాంటోళ్ళకు నాలుగైదు ఆటలు ఆడే పని చూపించలేక పోయినానని మనసు కష్టపెట్టుకోనుంటాడు. మా రాతయట్లుండాది. అయన్ననేదేముండాదిలే." కోపాన్నంతా వీలయినంత వినయంగా మార్చుకోవడానికి ప్రయత్నించాడు మునస్వామి.

"అట్లే మీగాదులే గురువా!" అన్నాడు చంద్రయ్య.

"పదండ్రా! అవతల బస్సొచ్చేస్తేదేమో!" అంటూ హెచ్చరించాడు మునస్వామి పెద్దగా నిట్టూరుస్తూ.

"రెండు రోజుల నుంచీ ఆకాశంలో అరకొరగా అల్లాడుతున్న మేఘాలు ఆకాశమంతా కమ్ముకున్నాయి. యెక్కడినుంచో పిల్లగాలి చల్లగా రివ్వురివ్వున దూసుకొస్తోంది. గాలికి రెపరెపలాడుతున్న జుట్టును సర్దుకుంటూ "విరాటపర్వమా మజాకా! యింకా పడలేదే అనుకుంటా వుంటి. యిబ్బుడు సూడు. మబ్బులాడతాండాయి." అన్నాడు అర్జునుడు.

"మనం ఆటెయ్యకముందుట్నుంచీ ఆ మోడాలు అట్లనే వుండాయిలేబ్బా" అన్నాడు భీముడు.

"ఆఁ... అవన్నీ వట్టి గర్భాలే. వానబడేమోడాలు గాదు." ఆకాశంలోకి చూస్తూ అన్నాడు బాలకృష్ణుడు. యింతలో అతని ముక్కుపైన వొగచినుకు టపుక్కున పడింది. "ఏమోననుకుంటి. యిరాటపర్వం బిర్రు అప్పుడే కనిపిచ్చెపో." తిరిగి అన్నాడుతను. ఆ తర్వాత ఒకటొకటే చినుకులు పడసాగాయి.

"గురువా! వచ్చెగదబ్బా చిన్నక్కలు" పరవశంగా అన్నాడు కృష్ణుడు.

"పడనీబ్బా సామీ. వానబడితేనే గదా, రాజ్జంపుంజిగా వుండేది." యింకా నీరసంగానే వున్న కంఠంతో సమాధానం చెప్పాడు మునస్వామి.

ఇంతలో 'పుయ్యాం పుయ్యాం' అని అరుస్తూ వచ్చి రోడ్లో ఆగింది బస్సు.

ఆటోళ్ళు గలింబిలిం అంటూ బస్సెక్కేశారు. ట్రంకుపెట్టెల్నీ, ఆయుధాల కట్టనీ, కిరీటాల మూటనీ బస్సులోపలికి చేర్చేశారు.

డ్రైవరు, కండక్టరు బస్సుదిగి ప్రక్కనుండే టీకొట్లోకి దూరిపోయి కాఫీలు తాగసాగారు. చినుకుల జోరు పెరిగి తుంపర ప్రారంభమైంది. మునస్వామి మాత్రం నేలపైన నిలబడి పైగుడ్డ నెత్తినేసుకొని, పాకాల రోడ్డు వైపు చూడసాగాడు. ఎక్కడా బ్రహ్మయ్య జాడేలేదు. పాకాల బస్సు వచ్చే టైం కూడా అయిందంటున్నారు లోపల ఎవరో. అయిదు నిముసాల తర్వాత డ్రైవరు కండక్టరు వచ్చి బస్సులో కూర్చునారు. ఇక తప్పదన్నట్లుగా మునస్వామి బస్సెక్కి ఫుట్‌బోర్డ్ పైన నిలబడ్డాడు. అంతవరకు ఆర్భాటంగా ఆరంభమైన తుంపర చినుకులు ఆగిపోయాయి. తూర్పున ఎండకాయసాగింది. 'అంతా మాయగా వుండాది' అంటూ గొణుక్కున్నాడు మునస్వామి.

ఇంతలో "పీప్' అంటూ గొంతుకోసేసిన కోడి పుంజులా అరుచుకుంటూ వచ్చి పక్కనే నిలబడింది పాకాల బస్సు. ఆత్రంగా కిందికి దిగబోయాడు మునస్వామి.

"య్యోవ్ పెద్దాయనా! యాడికి దిగతాండావు. ఎక్కు ఎక్కు కదల్తాది బస్సు." అరిచాడు కండక్టర్.

దిగబోయిన మునస్వామి అలాగే ఆగి పోయి పాకాల బస్సువైపే చూడసాగాడు. దానిలోంచీ కొందరు కిందికి దిగారు. దిగన వాళ్ళల్లో ఒక వ్యక్తిని చూడగానే అతని గుండె గుభిల్లుమంది. ఒకడుగు బస్సులోపలికి వేసి భయం భయంగా ఆ వ్యక్తిని మళ్ళీ చూశాడు.

"దేముడి కోసం యెగజూస్తె దెయ్యం వచ్చి మెడకు తగులుకున్నట్లు ఈ గ్రామీణ బ్యాంకు ఫీల్డాఫీసరుగాడు దిగిబడినాడు. పోవిడీ బట్టుకొని యెతకలాడతావుండేట్టుండాడు. కనబడితే సాలు తగులుకుంటాడు." అనుకుంటూ బస్సులోపలి జనం మధ్యలోకి దూరిపోయాడు మునస్వామి

కండక్లర్ రైట్ రైట్ అన్నాడు. బస్సు కదిలింది. పైగడ్డ బస్సు కుప్పంవైపుకు, పాకాల బస్సు పీలేరు వైపుకు ఒకేసారి కదిలాయి.

"ఈ బ్రహ్మయ్యగాడు సచ్చినాడో బతికినాడో తెలీలా. బతికుంటే ఎందుకు రాడు. వాడింక రానట్టే. ఇంక మేమంతా అడుక్కోని తినాల్సిందే. లేదా పిల్లా జల్లా కట్టగట్టుకోని పల్లెల్లో రైతుల మాదిరి మందో మాకో తాగన్నా సావాల్సిందే." ఆలోచిస్తూ మళ్ళీ మళ్ళీ నిట్టూరుస్తూ, కూర్చున్నాడు మునస్వామి. అప్పటికే బస్సు వేగం పుంజుకుంది.

## 4

"వొరేబ్బా, పై గడ్డన బ్యాంకీ వాణ్ణీ జూస్తి" ఆటోళ్ళందరకీ వాళ్ళ కివ్వాల్సిన డబ్బుల్ని యిచ్చేశాక అన్నాడు మునస్వామి.

"ఆఁ... అయితే యింకెట్ల గురువా?"

"ఇంటికి పోతే పట్టుకుంటారు. మన ఇండ్లు జప్తుచేస్తారు"

"జప్తు చేస్తే చేసుకోనీ! మన యిండ్లల్లో ఏముండాయనీ.?"

"అందుకే. మనం లోను తీర్చే అంత దుడ్డు సంపాదించిందాకా ఊర్లోకే పోగూడదు."

"మీరుసరే. యెక్కడైనా దాంకుంటారు. ఊర్లోనే యింకా అగోరించే మమ్మల్నేం చెయ్యమంటారు." అన్నాడు గెల్లపల్లోళ్ళ వీరయ్య

"మీకింఖా అక్కడ కొంచెం ఆదరువుండాది. అందుకని వుండారు. మా పోవుడీ తెల్సుకోవాలంటే ముందు మిమ్మల్నే అడగతారు. మా ప్రాణాలు మీ చేతిలో వుండాయి. నోరు జారినారంటే, మా పని అయిపోయినట్టే. ఏదన్నా ఆటపనివుంటే మాత్రం మా దగ్గరికి రాండి. అనావసరంగా మాత్రం రాబాకండి. ఆ ఫీల్డాపీసరు భలేపలాతనమైన మనిషి. చూసినాడంటే మీ వెనకాన్నే యెలబారి వచ్చేస్తాడు." అంటూ పరకాయించి చూడసాగాడు మునస్వామి. వీరయ్యతో బాటూ కంగుంది నుంచీ వచ్చిన ఆటవాళ్ళంతా బస్సుకోసం యెదురు చూస్తున్నారు. చాలా సేపటి తర్వాత కుప్పం బస్సు వచ్చింది. తృటిలో ఫీల్డాఫీసరు చేతుల్లోంచీ తప్పించుకున్న ఆటవాళ్ళు మాట్లాడేశక్తిని గూడ కోల్పోయారు. నీరసంగా వెనుదిరిగి తమ తోటి వాళ్ళకేసి నిస్సహాయంగా చూస్తూ వాళ్ళు బస్సెక్కారు. మిగిలిన తన శిష్యుల వైపోసారి కలయజూశాక "మనం చేస్తావుండే పని నిన్నటితో అయిపోయింది. ఇప్పుడు మళ్ళా కొత్తపనులు యెతుక్కోవాల గదా." అన్నాడు మునస్వామి.

"చిన్నగొట్టిగల్లు కాడ రోడ్డుపని జరగతావుండాదంట." అన్నాడు భీముడు.

"యింకెందుకు జాగు. ఆడికే పోదాం పదండి." అన్నాడు మునస్వామి. తలా ఒకమూట నెత్తుకొని అందరూ రోడ్డుపైన నడవసాగారు.

"పై గడ్డ మీద నించీ గదా గొట్టిగల్లుకు పోయేది. దార్లో యాడన్నా బ్రహ్మయ్య కనిపిస్తే బాగుండు." దారిపొడుగునా అనుకుంటూనే వున్నాడు మునస్వామి. యెంత నడచినా దారి సాగుతూనే

వుంది. రెండు మూడు కిలోమీటర్ల దూరానికి బస్సెక్కడమెందుకని అనుకున్నారు ముందుగా. కానీ నడవను నడదవనూ యాతన పెరగసాగింది. గంట నడక తర్వాత రోడ్డుపైన పనులు జరుగుతున్న చోటు చేరువయ్యింది.

అక్కడ దాదాపు అరఫర్లాంగు పొడవునా రోడ్డుపైన పనులు సాగుతున్నాయి. కొందరు సైడు కాలువలు తవ్వీమట్టి పోస్తుంటే... కొందరు కంకర పోస్తున్నారు. మరి కొందరు తారు పోస్తున్నారు. ఒక వాహనం రోడ్డు రోలరును ఈడ్చుకుంటూ తారు పోసిన భాగాలను చదును చేస్తోంది... అక్కడక్కడా తారు మంటలపైన తారు డ్రమ్ములు కరుగుతున్నాయి. నల్లటి బక్కెట్లూ, నల్లటి పెనాలు పట్టుకుని, నల్లగా మారి పోతున్న కూలీలు రోడ్డును నలుపు చేసే పనిలో హడావిడిగా వున్నారు. నెత్తిన ఒక టోపీ వేసుకుని ఓ నలభైఏళ్ళ మేస్త్రీ అందరినీ అజమాయిషీ చేస్తూన్నాడు. అతనికవతల కొన్ని కొరముట్లు ఉడ్డగా పడివున్నాయి.

మునస్వామి మేస్త్రీ దగ్గరికెళ్ళి వినయంగా నమస్కరించాక "పని కోసం వస్తాముండామన్నా! మాకు పనిప్పించు" అని వేడుకున్నాడు.

"చేసే వాళ్ళకు ఎంత పనైనా వుంటుందిలే పోండి, చెయ్యబోండి" అన్నాడు మేస్త్రీ.

"మరి కూలీ అదీ యెట్లన్నా?." నల్లటి నాలుకలా విస్తరిస్తున్న తారురోడ్డు కేసి పరాకాయించి చూస్తూ అడిగాడు మునస్వామి.

"మధ్యాహ్నం కాంట్రాక్టరొస్తాడు. ఆయన్నడగల్ల" అన్నాడు మేస్త్రీ.

"రేయ్. ఇంకా చూస్తా నిలబడతారేందిరా. ఎత్తండి తగార్లు పట్టండి పారలు." అంటూ పక్కనే వున్న ఓ తగారు చేతుల్లోకి తీసుకున్నాడు మునస్వామి. బూసెమ్మతో సహా అందరూ తలా ఒక కొరముట్టు చేతబట్టుకుని పనిలోకి దిగి పోయారు.

"పైగడ్డ ఎంత దూరం. మహాఅంటే పదిమైళ్ళు. ఈ రోడ్డు మీద పై గడ్డనించీ ఎన్నో బస్సులు, లారీలు వస్తున్నాయి, పోతున్నాయి వాటిలో వస్తూ పోతూ బ్రహ్మయ్య కనిపించడా?" అనుకున్నాడు మునస్వామి. యాభై అరవై మంది కూలీ వాళ్ళు రకరకాల పనుల్లో హడావుడిపడుతున్నారు. 'పదవయ్యా పెద్దాయనా! ఆలస్యమెందుకు?' అంటూ కుర్రకూలీ విసుక్కుంటున్నాడు. కూలీలనే మానవయంత్రాలలో తానూ వొకడైపోయి, తన ఆలోచించుకునే తీరికను గూడా పోగొట్టుకోసాగాడు మునస్వామి. తారు రోడ్డుపైన ఎండ మినమినలాడుతోంది. అలా యెంతసేపు గడచిందో మునస్వామికి తెలియలేదు. ఒక బైక్ పటపటమని శబ్దం చేసుకుంటూ దూరం నుంచీ అటువైపుకు వస్తున్న శబ్దం వినిపించింది.

"య్యోవ్, కాంట్రాక్టర్ వస్తావుండాడు. జాగ్రత్త! బాగా చెయ్యండి." హెచ్చరించాడు మేస్త్రీ.

వేగంగా వచ్చి మేస్త్రీకి సమీపంలో ఆగింది బైక్. దానిపై నుంచీ ఓ ఆరడుగుల ఆజానుబాహుడుదిగాడు. అతను తొడుక్కున్న తెల్లటి గుడ్డలు గాలిలో యెగురుతున్నాయి. యాభై అయిదేళ్ళ వయసుండచ్చు. ఆ వ్యక్తిని చూడగానే మునస్వామికి చెప్పలేనంత ఆనందం కలిగింది. చేస్తున్న పనిని ఆపేసి అలాగే అతని దగ్గరకి పరిగెత్తుకెళ్ళాడు. "ఏమబ్బా నువ్వేనా కాంట్రాక్టరువి.?" అని సంభ్రమంగా అడిగాడతణ్ణి.

"ఎవరితను?" అనుకుంటూ ఒక్కక్షణం మునస్వామి కేసి ఎగాదిగా చూశాడా వ్యక్తి. మాసిన గడ్డం, తెల్లబడిన జుట్టు, చిరిగిపోయి మురికి పట్టివున్న చొక్కా, కనురెప్పలు గబగబా ఆర్పుతూ మరింతగా పరీక్షించి చూడసాగాడా కాంట్రాక్టరు.

"నేను బ్రహ్మయ్యా! కంగుంది ఆరేళ్ళ మునస్వామిని" తన కుడిచేతికున్న ఆరోవేలు చూపిస్తూ చెప్పాడు మునస్వామి.

అతను మునస్వామి కేసి మరోసారి ఎగాదిగా చూశాక "నువ్వా గురువాఁ నాటకాలు మానేసి, ఈ పనికెళబారినావేంది.?" అని ప్రశ్నించాడు.

"ఏంలేదబ్బా. మా పక్క వాగిటే వరుపు. అవరుపుకు తట్టుకోలేక పని చేసుకుందామని ఇట్ల పలస్తరం వచ్చేస్తిమి." బ్రహ్మయ్య కనిపించిన ఆనందంలో తమ కష్టాన్ని సైతం సంతోషంగా చెబుతున్నాడు మునస్వామి.

"యెంతకరువైతే మాత్రం! కులవృత్తి వదిలేసి యిట్ల ఏపనంటే ఆ పని జేస్తే అవమానం గాదా? నాటకం ఆడాలంటే మీకు చోటేలేదా?" బ్రహ్మయ్య కంఠంలో కోపమూ చిరాకూ తొంగిచూశాయి.

"ఈ కరువు దినాల్లో రైతుల చేతుల్లో దుడ్డెక్కడుందబ్బా! రైతులు చల్లంగవుంటేనే గదా మా బోటి ఆటోళ్ళ ప్రభయెలిగేది! అప్పటికీ నువ్వు రమ్మన్నావంటే మీ పైగడ్డకు పొయ్యి, నిన్ననే నాటకం యేసేసొస్తిమి. కూలి పాటుకూడా గిట్టలే. నువ్వేమో అయిపులేకుండా పోతివి. యిప్పుడు నిన్ను చూసే గుండికి ప్రాణం లేసొచ్చింది. నువ్వు రమ్మన్నప్పుడంతా వచ్చి భారతాలాడినాం గదా. మీ ఊరొచ్చి యెప్పుడు భారతమేసినా నాలుగు నెలల బత్తెమయినా మాయింండ్లకు చేరతావుండె. యిప్పుడు కానా కష్టమై పోయిండాది. సరే, చెప్పబ్బా. మావోళ్ళందురూ ఈడనే వుండారు. రేత్తిరికి గావాలన్నా మేము రెడీ." ఉత్సాహంతో ఊగిపోతూ అన్నాడు మునస్వామి.

"మీవాళ్ళంతా ఇక్కడే వుండారా. యెక్కడ! చూపించు" విసుగ్గా అడిగాడు బ్రహ్మయ్య.

"మేం చానామందేవచ్చినాం. అద్దో. ఆ పికాసెత్తుకోని సైడుకాలవలో చెట్లు తవతా వుండాడే, వాడు దుర్యోధనుడు. రాళ్ళు మోస్తావుండేవాడు భీముడు. గడ్డపారతో కాలవ తొవ్వతావుండేవాడు అర్జునుడు. ఆపక్కనే బప్పను బాలయ్య. తగార్లతో మన్నుమోస్తా ఉండేవాళ్ళు నకులసహదేవులు. ఆపక్కన చీరకొంగును చుట్టబెట్టుకోని తట్టమోస్తావుండేది నా భార్య బూసెమ్మ. అట్లే యింగా చానా మంది మావోళ్ళు ఆమట్టి మోసేవాళ్ళల్లో వుండారు." అందరినీ పరిచయం చేశాడు మున స్వామి. "కేకలేస్తూ ఈలలేస్తూ తన దండుతో 'వచ్చే కౌరవులదండు' అంటూ స్టేజీ అంతా ఎగిరెగిరి గుమ్మెత్తించే గొప్ప ఆటగాడు మా దుర్యోధనుడు. భారతం కడదినాన నేలపైన తీర్చిన దుర్యోధనుడి బొమ్మ మిందకూసోని జల్దిలో దాక్కునే సీను మావోడు పాడతావుంటే ఎంత గొప్పగా వుండేదో! ఆ భీముడయితే ఎంత ఆగింతం చేసేవోడు. స్టేజీమింద దుర్యోధనున్ని చూస్తానే పటపటా పండ్లు కొరికి, నిలవలేక, అప్పడే దూకిచంపేసేటట్టు ఉగ్రమొచ్చినోడి మాదిరి ఊగిపోతా ఎగిరెగిరి దూకేవాడు. వాడక్కడుం డాడు సూడు. ఇప్పుడు దుర్యోధనుడితో కలిసి రాళ్ళు మోస్తావుండాడు. ఇంక అర్జునుడైతే ఘోటిక

మెటకకూ వొగపద్యమో వొగదరువో పాడుకుంటా ధైర్యంగా తపసు మానెక్కిదిగేవోడు. అక్కడ కాలవ తవ్వుకుంటా కనిపిస్తావుండాడు. బఫూన్ బాలయ్య స్టేజీ మీద కనిపిస్తానే జనం నవ్వలేకచస్తావుండ్రి. ఆ బాలకృష్ణుడు ఎంత గొప్పహార్మోనిస్టు. ఏ పాత్ర పాడే పాటయినా హార్మోనీతో ముందేవాయిస్తా అటానెత్తిచ్చేస్తావుండె. తబలిస్టుసిద్దప్ప మాత్రం ఏం సామాన్యుడా.... వొక్కొక్కడు వొక్కొక్క మెరిక. వాళ్ళకు వాళ్ళే సాటి. మా బూసెమ్మ మాత్రం యేం సామాన్యురాలా. వయసులో వున్నప్పుడు సైరంధ్రి యాసంకడతావుండె. అది చూసిన జనం యాడవలేక పోతావుండ్రి. అట్టాంటోళ్ళు కానికాలం దాపరించబట్టి గదా ఈడ కూలిపన్లు చేసుకుంటా వుండారు. జనాల మధ్యనే అజ్ఞతనానం చేస్తావున్నిట్టుండారు."ఏంబ్రహ్మయ్యన్నా చూస్తావుండావాలేదా. ఏమయ్య ఆలోచనల్లో బడిపోతివి?" అడిగాడు మునస్వామి. బ్రహ్మయ్య వులిక్కిపడుతూ 'మీ గురించేన్నా' అన్నాడు

"మాగురించా. ఏమైనా భారతం పెట్టిస్తావా?" అని అడిగాడు మునస్వామి మళ్ళీ.

"యాడన్నా. ఈపక్కా అయిదేండ్లనించీ వొగిటేకరువు. జనాలకు తిండికే లేకపాయ. ఇంక భారతాలాడించేదానికి దుడ్డేడుంది. భారతమంటే వొగడూ వొగపైసా యివ్వకపాయ. యింకేంచేసేది. నేనొగన్నే జరిపించేదానికి అన్ని వేలరూపాయలు నేను మాత్రం యాడినించీ తెచ్చేదిచెప్పు. నాకూపిల్లా పాపా, సంసారం అన్నీవుండాయి గదా." అన్నాడు బ్రహ్మయ్య. మునస్వామి నోటమాట రాకపోవడంతో కాస్సేపు బ్రహ్మయ్య కేసి మౌనంగా చూస్తూ వుండిపోయాడు. తర్వాత బలవంతంగా నవ్వడానికి ప్రయత్నించి విఫలుడైపోయాడు. పెద్దగా నిట్టూరుస్తూ అదీ నిజమేలే. నువ్వు మాత్రం ఏం జేస్తావు. ఇంతకూ రోడ్డుపని నువ్వెట్లెత్తుకున్నావు.?" అని అడిగాడు.

"యిప్పుడు యెక్కడ చూసినా జరగతావుండేది రోడ్లేసేవాపనే గదా! పంటలు పండక పోయినా, వానలు పడక పోయినా, దీనికి మాత్రం వద్దంటే దుడ్డు కుమ్మరిస్తావుండారు. యెన్నిదినాలని భూమినే నమ్ముకునేది చెప్పు. చూసిచూసీ నేనూ యీపనిలోనే దూరేసినాను. ఈప్రాంతానికి నేనే కొంత రోడ్డు కాంట్రాక్టు తీసుకోని పని చేయిస్తా వుండాను. అట్లన్నా కొందరికి సాయపడదామని. యింకో విషయం మరిచినా. ఇంక వారందినాలతర్వాత మీకో పనుండాది. నాటకమాడాల" అన్నాడు బ్రహ్మయ్య.

"యెక్కడాడాల్ల" నాటకం పేరువినగానే మళ్ళీ మునస్వామిలో ఆశలు మొలకెత్తాయి.

"గొట్టిగల్లులో వొగ చావునాటకం ఆడాల."

"చావునాటకమా?"

"అవునన్నా. పై గడ్డనించీ ఈడికొస్తావుంటే క్రాసులో చిన్నగొట్టిగల్లు సర్పంచి కనిపించె. వాళ్ళమ్మచచ్చిపోయి వారందినాలయిందంట. దినాలప్పుడు చచ్చినోళ్ళ ఆత్మశాంతి కోసరం నలదమయంతో, హరిశ్చంద్రో ఏదోవొగ శోకనాటకం యేపిస్తారుగదా .... అందుకనే ఆటోళ్ళెవ్వరైనా దొరికితే చెప్పన్నా అన్నాడు. ఇంతలో వొగబ్యాంకీ ఆయన నన్ను కంప పట్టుకున్నిట్టు పట్టుకుండె. లేకంటే నాటకమాడాల్సిన తేదీ గూడా చెప్పిండేవోడు. ఆ సర్పంచి." చెప్పాడు బ్రహ్మయ్య.

"బ్యాంకీవాయనా..." బితుకు బితుకుమంటూ అడిగాటు మునస్వామి.

"బస్టాండ్లోనే గదా బ్యాకీ వుండేది. నన్ను జూస్తానే గ్రామీణ బ్యాంకు ఫీల్డాఫీసరొకాయన

పరిగెత్తుకుంటా వచ్చేసినాడు. వాళ్ళది కుప్పమంటలే. ఆ యిలాకాలో కొందరు రైతులు లోన్లు దీసుకోని, పైసా గూడా కట్టకుండా ఎగ్గొట్టినారంట. వాళ్ళల్లో కొందరు యీపక్కకొచ్చి కూలీనాలీ చేసుకుంటా వుండారని పోవిడి తెలిసిందంట. అట్టాంటోళ్ళెవరైనా నీదగ్గర పంజేస్తావుండారా అని అడిగినాడు."

ఆ మాటకు మునస్వామి అతడికి కనిపించకుండా ముఖం అవతలికి తిప్పుకున్నాడు. "కొందరు ఆటోళ్ళకు మూరాజానెడు చేను గుడ్డాలున్నాయనీ వాటివల్లా వాళ్ళకు గూడా కొంత లోను దొరికిందనీ బ్రహ్మయ్యకు తెలిసినట్టులేదు." అని మనస్సులోనే గొణుకున్నాడు.

"ఏమయ్యా అన్నతో నకరాలు పడతాండావు. ముందుపనిచూడు." కేకేశాడు మేస్త్రీ. మునస్వామి ఏమీమాట్లాడకుండా, మౌనంగా వెళ్ళి తనపనిలో తాను మునిగిపోయాడు.

"గురువా! యాడకీపోవద్దు. రేపు ఆ సర్పంచిని నాతో గూడా తొడుక్కోనొస్తా. ఆయనకు మీరే ఆటెయ్యాల." బ్రహ్మయ్య పెద్దగా అరిచాడు.

\+ \+ \+ \+

చిన్నగొట్టిగల్లు సర్పంచిని వెంటబెట్టుకొని చావునాటకం వప్పించడానికి మరునాటి ఉదయమే ఉత్సాహంగా పని జరుగుతున్న చోటికి వచ్చాడు బ్రహ్మయ్య. కానీ అక్కడ కంగుంది వాళ్ళు కనిపించక పోవడంతో కంగారు పడుతూ మేస్త్రీని పిలిచి వాళ్ళను గురించి వాకబు చేశాడు.

"నిన్న వాళ్ళకు సగంకూలీ దుడ్డేయించ్చినానన్నా. నా దగ్గిర సమయానికిలెక్క తక్కువే వున్నింది. అడికీ నువ్వు వస్తానే పూర్తికూలీ తీసిస్తానని చెప్పినా... వాళ్ళు సణగతా వున్నారు. కానీ చెప్పాపెట్టకుండా యిట్ల యెలబరిపోతారనుకోలే నిన్న సాయంత్రమే వాళ్ళు యేదో బస్సెక్కినారంట. చూసినోళ్ళు చెప్పినారు." అన్నాడు మేస్త్రీ.

నాటకం వేయవలసిన అవసరం వుందని తాను చెప్పినా, కంగంది ఆటగాళ్ళు యిలా చెప్పా పెట్టకుండా యెందుకు మాయమైపోయారో బ్రహ్మయ్యకెంతకూ అర్థంగాలేదు.

● ఆదివారం ఆంధ్రప్రభ - నవంబర్ 30, - డిసెంబరు 7-2003 ●